
# జాతి ఆకాంక్ష కాదు మానవతకు అవమానం



ముస్లిం మంత్రి ఇచ్చిన రంజాన్‌ఇఫ్తార్ విందులో పాల్గొంటూ బాబ్రీ మసీదు స్థానంలో రామాలయ నిర్మాణం జాతి ఆకాంక్షగా వర్ణిస్తూ ముస్లింలు దానికి ఒప్పుకొని మసీదు కట్టుకోవడానికి వేరే ఎక్కడైనా జాగా అడుక్కోవడమే దానికి పరిష్కారమని ప్రకటించే వ్యక్తిని ప్రధానమంత్రిగా ఆదరించడం సంగతి అటుంచి, మనిషిగా గౌరవించడం సాధ్యమా?

తన అసలు రంగు దాచుకోవడం అటల్‌జీకి సాధ్యం కావడం లేదు.

ఆయనను దేశప్రధానమంత్రిగా భారతీయ జనతాపార్టీవారు ప్రతిపాదించిన నాటి నుండి ఒక ప్రహసనం చూస్తున్నాం.

అటల్ బీహారీ వాజ్‌పేయి హిందుత్వవాదులలో 'ఉదారవాది' అనీ, అద్వానీ వంటి కరడుగట్టిన హిందుత్వవాదులకూ ఆయనకూ చాలా తేడా ఉందనీ మనల్ని వారు నమ్మమంటూ వచ్చారు. నమ్మదలచుకున్నవారు నమ్ముతున్నారు. దానికి తగిన మాటలు అటల్‌జీ అప్పుడప్పుడు మాట్లాడుతుంటారు. కానీ సంఘ్‌పరివార్ మాతృసంస్థ అయిన ఆర్‌ఎస్ఎస్ పట్ల తన విధేయత ఆయన పదేపదే ప్రకటించుకుని జాగ్రత్తపడుతున్నాడు. ఆర్‌ఎస్ఎస్‌కే కాదు నిన్న మొన్న పుట్టిన బజ్రంగ్‌దళ్‌కు కూడా ఆయన విధేయుడని బాబ్రీమసీదు కూల్చివేత వార్షికదినాన ఆయన అన్నమాటలు, మరుసటి రోజు దానికిచ్చిన వివరణ మనకు చెప్తున్నాయి.

ఆ మాటల సందర్భాన్ని ఒకసారి గుర్తు చేసుకుని ఆ మాటల భావాన్ని ఆ తరువాత చర్చించుకుందాం. బాబ్రీమసీదు కూల్చివేత కేసులో సిబిఐ చార్జిషీటు పెట్టిన కారణంగా ఎల్.కె. అద్వానీ, ఉమాభారతి, మురళిమనోహర్‌జోషిలు కేంద్ర కేబినెట్ నుండి రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి.

నేరమయమయిన రాజకీయాలలో చార్జిషీటు పెట్టడానికి పెట్టకపోవడానికీ ఉన్న తేడా స్వల్పమే కాబట్టి 'చార్జిషీటు పెట్టినంత మాత్రాన మా వాళ్లు రాజీనామా చేయనక్కరలే'దని వాజ్‌పేయి దబాయించి ఊరుకుని ఉంటే సగటు భారత రాజకీయవేత్త నైజాన్ని ప్రదర్శించాడనుకుని ప్రజలు ఊరుకుందురేమో.

కానీ వాజ్‌పేయి అక్కడితో ఆగలేదు. 'ఆ ముగ్గురూ నేరం చేయలేదు' అని దబాయించి కూడా ఊరుకోలేదు. 'బాబ్రీమసీదు కూల్చివేత నేరమేకాదు, జాతి మనోభీష్టం' అన్నాడు.

అది ఏజాతి మనోభీష్టం? హిందువులందరి మనోభీష్టం కూడా కాదు. తమను తాము హిందువులుగా భావించేవారిలో కూడా చాలా మంది ఆ మసీదు కూల్చివేత గొప్పపని అనుకోలేదు. అందులో రామభక్తులూ ఉన్నారు, అక్కడ ఒకప్పుడొక రామాలయం ఉండిందని నమ్మేవారూ ఉన్నారు. చరిత్రలో ఎప్పుడో జరిగిందో లేదో తెలియని విషయాన్ని ఆధారం చేసుకుని విద్వేషాలు రెచ్చగొట్టడం భిన్నమతాలూ సంప్రదాయాలూ కలిసి బతకాల్సిన భారత ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్న ఇంగితం ఉన్నవారెవ్వరూ బాబ్రీమసీదు కూల్చివేతను హర్షించలేదు. హర్షించకపోగా భిన్న సంప్రదాయాల సహజీవనానికి గొడ్డలిపెట్టు వంటి చర్యగా దానిని గుర్తించారు.

మన దేశంలోని భిన్న మతాలకు చెందిన ప్రార్థనా స్థలాలనొక్కొక్కదానినీ తీసుకొని వాటి చరిత్ర తవ్వుకుంటూ పోతే ఏదో ఒక దశలో ఒక భిన్న ప్రార్థనా సంప్రదాయానికి చెందిన పూజాస్థలాన్ని నయానోభయానో ఆక్రమించుకొని, లేక తమ

పూజాసంప్రదాయంలోకి కలిపేసుకొని కట్టినవే బహుశా ఎక్కువ ఉంటాయని గుర్తిస్తాం. ఇప్పుడు ఆ తొలినాటి పూజాస్థలాలన్నిటినీ పునరుద్ధరించే కార్యక్రమం పెట్టుకుంటే మన సమాజంలో సామరస్యం, సహజీవనం సాధ్యం అవుతాయా? కావని మెజారిటీ ప్రజలకు తెలుసును కాబట్టే బాబ్రీమసీదు కూల్చివేతను అధికభాగం ప్రజలు హర్షించలేదు. బాబ్రీమసీదు ఉన్నచోట ఒకప్పుడు రామాలయం ఉండిందని నమ్మితే కూడా పై ప్రశ్న వేసుకోకతప్పదు, పై సమాధానం చెప్పుకోక తప్పదు. కానీ నిజానికక్కడ ఒక రామాలయం ఉండిందని భావించడానికి ఆధారాలున్నాయని పూర్తిగా సంఘపరివార్‌కు చెందిన చరిత్రకారులు తప్ప వేరే చరిత్రకారులెవ్వరూ ఒప్పుకోవడం లేదు.

అదట్లా ఉంచి, యాభై ఏళ్లనాడు సంఘపరివార్‌వారు ఆ మసీదులోకి దొంగతనంగా కొన్ని విగ్రహాలను చొప్పించడం ద్వారా ప్రారంభమైన ఈ కృత్రిమ 'వివాదానికి' వాజ్‌పేయి చెప్పిన పరిష్కారం ఆయన మనోభావాలను మరింత తేటతెల్లం చేసింది. 'ఆయనేం అన్నాడు? హిందువులు, ముస్లింలు ఒక చోట కూర్చుని పరిష్కారం చేసుకోవాలనేకదా అన్నాడు?' అని ఆయన అభిమానులు దబాయించే ప్రయత్నం చేస్తున్నారు. ఆయన అన్నది అది కాదు. డిసెంబర్ 6 వ తేదీన మాట్లాడుతూ 'బాబ్రీమసీదు కూల్చివేతలో నేరం ఏముంది? అదొక జాతీయ భావవ్యక్తీకరణ. అదింకా పూర్తి కాలేదు' అన్నాడు. మరుసటి రోజు ఆ అభిప్రాయాన్ని వివరిస్తూ, అది ఏ విధంగా పూర్తి కాగలదో చెప్పాడు. 'కోర్టు తీర్పు రామాలయానికి అనుకూలంగా రావచ్చు, లేదా ముస్లింలు హిందువుల ఆకాంక్షను మన్నించి అక్కడ వారిని రామాలయం కట్టుకోనియ్యవచ్చు. వారికి మసీదు కట్టుకోవడానికి హిందువులు వేరే ఎక్కడయినా జాగా చూపించవచ్చు' అన్నాడు. హిందువులూ ముస్లింలూ కలిసి కూర్చుని మాట్లాడుకొని పరిష్కరించుకోవడం అంటే అర్థం ఇది! ఇంకొకరకంగా చెప్పాలంటే కోర్టు తీర్పయినా రామాలయానికి అనుకూలంగా రావాలి, లేదా ముస్లింలు కోర్టులో గెలిచినా రామాలయం నిర్మాణానికి తల ఒగ్గాలి, లేదా...

లేదా ఏం జరుగుతుందో వాజ్‌పేయి చెప్పనక్కర లేదు. విశ్వహిందూపరిషత్ నాయకులు ఆయనగారి ప్రకటనకు స్పందిస్తూ వెంటనే చెప్పారు. రేపు రానున్న జనవరి మాసం నుండి అయోధ్య రామాలయ నిర్మాణానికి ఉద్యమం మొదలు పెడతామని అన్నారు. ఇంక వారికీ అటల్‌బిహారీ వాజ్‌పేయికీ తేడా ఎక్కడుంది? ఒకరి మనసులోని మాటలు మరొకరు నోటితో చెప్పారు. ఒకరి మాటలలోని ఖాళీలను మరొకరు తమ ప్రతినలతో పూరిస్తారు.

వాజ్‌పేయి కవి అనీ సాహిత్యవిలువలు ఎరిగిన వ్యక్తి అనీ అంటారు. కానీ ఏమాత్రం సున్నితమెరిగిన వ్యక్తి అయినా ఈ మాటలు మాట్లాడడానికి రంజాన్ ఇఫ్తార్ విందును ఎంచుకోడు. అందులోనూ తన కేబినెట్ సహచరుడయిన ఒక ముస్లిం మంత్రి ఇచ్చిన ఇఫ్తార్ విందును ఎంచుకోడు. హిందువులలో సంఘపరివార్ ఉన్మాదులున్నట్టే ముస్లింలలోనూ మతోన్మాదులున్నారు. కానీ బాబ్రీమసీదు కూల్చివేత వారిని మాత్రమే కలవరపెట్టలేదు. మతోన్మాదానికి చాలా దూరం ఉండే ముస్లింలను కూడా కలవరపెట్టింది. మైనారిటీ మతస్తుల సంప్రదాయాలకూ మత ఆచారాలకూ రక్షణ కల్పించే లౌకికవాదసూత్రమేదైతే భారత రాజ్యాంగంలో ఉందో అది ఆనాడు ధ్వంసమయిందని భావించారు. ముస్లింలు మాత్రమేకాదు, ప్రజాస్వామికవాదులందరూ అదే విధంగా భావించారు.

దేశానికే అవమానకరమయిన ఆ ఘటనకు సంకేతమైన డిసెంబర్ 6 నాడు ఒక ముస్లిం మంత్రి ఇచ్చిన రంజాన్‌ఇఫ్తార్ విందులో పాల్గొంటూ అయోధ్యలో రామాలయనిర్మాణాన్ని జాతి ఆకాంక్షగా వర్ణిస్తూ ముస్లింలు దానికి ఒప్పుకొని మసీదు కట్టుకోవడానికి వేరే ఎక్కడైనా జాగా అడుక్కోవడమే దానికి పరిష్కారమని ప్రకటించే వ్యక్తిని ప్రధానమంత్రిగా ఆదరించడం సంగతి అటుంచి, మనిషిగా గౌరవించడం సాధ్యమా?

వోట్లు వేయని జనం సంగతి అటుంచి, వేసిన వారిలో సహితం మెజారిటీ వీరికి వోటు వేయలేదు. అయినప్పటికీ రకరకాల అవకాశవాదులను వెనకేసుకొని ఈ హిందుత్వఉన్మాదులు గద్దెనెక్కారు. ప్రజాస్వామ్యాన్ని అవమానపరిచే తమ రాజకీయనీతికి జాతి ఆకాంక్ష అని పేరు పెట్టి 'ఉదారవాది' అన్న ముఖోటా తగిలించిన వాజ్‌పేయిని ద్వారా దానిని పలికిస్తున్నారు.

ఈ ప్రహసనానికి ఎంతకాలం ప్రేక్షకులుగా ఉంటామన్నదే మనం నిర్ణయించుకోవలసిన విషయం.

10 డిసెంబర్ 2000

మానవహక్కుల వేదిక

(HRF)